కథ

# షాక్ లగా...

కొల్లూరి సోమశంకర్

చాలాకాలం తర్వాత కొత్త చెప్పులు కొనుక్కున్నాను. పొట్ట పెరిగిపోతుండడంతో, పొద్దున్న పూట వాకింగ్ చెయ్యాలని గట్టిగా డిసైడైపోయా, అటు వాకింగ్‌కి, ఇటు ఆఫీసుకి పనికొచ్చేలా అందమైన మెత్తటి చెప్పులు మూడొందల యాభై రూపాయలు పోసి కొన్నాను. నా జీవితంలో ఇదే మొదటిసారి చెప్పులకింత ధర పెట్టడం! ఈ రోజు శనివారం. వారంలో ఆఖరి వర్కింగ్ డే కావడంతో కాస్త పనెక్కువగా ఉంది. ఏదో రిపోర్టు టైపు చేసి ప్రింట్ కమాండిచ్చాను. పేజీలు తీసుకుందామని ప్రింటర్ దగ్గరకి వెళ్ళాను. చాలా సేపటి వరకు ఉపయోగించక పోవడం వలన అది ఇనాక్టివ్ మోడ్‌లోకి వెళ్ళిపోయింది. దాన్ని ఆక్టివేట్ చేయడానికి స్విచ్ నొక్కబోయాను. అంతే...! జివ్వుమంటూ షాక్ కొట్టింది. మైల్డ్ షాకే అయినా, ఒక్కసారిగా ఒళ్ళంతా జలదరించింది.

మా కొలీగ్ చేత ఆ బటన్ నొక్కించాను. ప్రింటర్ నుంచి పేజీలను అతనే నాకందించాడు. ఎందుకైనా మంచిదని ఎలెక్ట్రీషియన్‌కి కబురు పెట్టాం. అతను సోమవారం వస్తానని చెప్పాడు. ఆ రోజు ఆఫీసులో ప్రింటర్ వాడడం తగ్గించాం. ఒకవేళ తప్పనిసరిగా వాడాల్సొచ్చినా స్విచ్‌లని నేరుగా చేత్తో కాకుండా పెన్‌తో నొక్కాం. సాయంత్రం ఆఫీసయ్యే టైంకి నా పని పూర్తవలేదు. మా కొలీగ్ దగ్గరనుంచి తాళాలు తీసుకుని నా దగ్గర ఉంచుకున్నాను. ఆరున్నర దాటాక, టీ చేసుకుందామని టీ కెటిల్‌లో నీళ్ళుపోసి స్విచ్ బోర్డులో ప్లగ్‌పెట్టి 'ఆన్' బటన్ నొక్కాను. ఒక్కసారిగా టప్‌మనే శబ్దంతో లైట్ ఆరిపోయింది, అదిక పనిచేయలేదు. పొద్దున్న ప్రింటర్ షాక్ కొట్టడం, ఇప్పుడీ టీ కెటిల్ పాడైపోడంతో ఆఫీసులో ఏదో ఎలెక్ట్రికల్ ప్రాబ్లం ఉందని నిర్ధారించుకున్నాను. టీ తాగాలన్న ఆలోచన మానుకుని, గబగబా పని పూర్తి చేసుకుని ఇంటికి బయల్దేరాను

+ + +

ఆదివారం మా చుట్టాలింటి గృహ ప్రవేశం. నగర శివార్లలో ఇల్లు కట్టుకున్నారు వాళ్ళు. కార్యక్రమం అంతా ముగిసింది. అందరూ భోజనాలు చేసి వెళ్ళారు. ఇంకా ఇంటి వైరింగ్ పనులు పూర్తి కాలేదు. మంచి ముహూర్తమని గృహప్రవేశం చేసేశారు. టీవీలో క్రికెట్ మ్యాచ్ వస్తుంటే చూస్తూ కూర్చున్నాం. ఇండియా టీం ఓడిపోయేలా ఉంది. ఇంతలో ఎక్కడి నుంచి వచ్చిందో ఓ పెద్ద జెర్రి టీవీకి దగ్గరగా వచ్చింది. దాన్నికొట్టాలని నేను నా చెప్పుని చేతిలోకి తీసుకున్నాను. కాని అదెటో తప్పించుకుంది. చెప్పు పట్టుకుని ఉన్న నా చెయ్యి టీవీకి దగ్గరగా వెళ్ళగానే అందులో ఏవో ప్రకంపనలొచ్చి ఒక్కసారిగా ఆగిపోయింది. ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు ఇంటి వైరింగులో ఏదైనా సమస్య ఉండి ఉంటుందని అనుకున్నారంతా. అప్పుడే లోపలికి అడుగు పెట్టాడు నాకు బావమరిది వరసైన పవన్. అతను కొత్తగా పెట్టిన ఓ తెలుగు టీవీ ఛానల్‌లో పనిచేస్తున్నాడు

"బావగారు... బాగున్నారా?" అంటూ నా చేయందుకున్నాడు. అంతే ఒక్కసారిగా వెనక్కి జరిగాడు. అతని ముఖంలో ఆశ్చర్యం.... అపనమ్మకం!

"బావగారూ, మిమ్మల్ని ముట్టుకుంటే షాక్ కొడుతోంది" అన్నాడు నాతో మెల్లగా.

నాకు నమ్మబుద్ధికాలేదు. ఏం జరుగుతోందో ఏమర్థం కావడంలేదు. కాసేపేవో కబుర్లు చెప్పుకుని ఇంటికి బయల్దేరాము.

+ + +

సోమవారం ఎలెక్ట్రీషియన్ వచ్చాడు. వైరింగ్, స్విచ్ బోర్డులు, ఎర్తింగ్ అన్నీ చెక్ చేసాడు. టీ కెటిల్‌లో ఏదో చిన్న పార్ట్ కాలిపోయిందని, మిగతావేవీ ప్రాబ్లం లేదంటూ వంద రూపాయలు పట్టుకుపోయాడు. ఈ వారం అంతా ఆఫీసులో చాలా బిజీగా ఉన్నాం. హెడ్ ఆఫీసునుంచి మా డైరెక్టరు, ఇంకొంతమంది కొలీగ్‌లు రావడం, మీటింగులతో తీరిక లేకుండా గడిపాం. మళ్ళీ సోమవారం వచ్చేసింది. పదకొండింటికి ఆఫీసులో టీ తాగుతుంటే, కొంచెం తుళ్ళి నా చేతిమీద ఒలికింది. చెయ్యి కడుక్కుందామని బకెట్‌లోని మగ్‌తో నీళ్లు అందుకోబోయాను. అంతే...! దిమ్మ తిరిగేలా షాక్ కొట్టింది. తమాయించుకున్నాను.

మా కొలీగ్ నీళ్ళు పోస్తే చేయి కడుక్కుని వచ్చి సీట్లో కూర్చున్నాను. రుమాలుతో తుడుచుకుని, అప్పటి దాకా చేసిన డాటా ఎంట్రీ పనిని కొలీగ్‌తో కలిసి సరిపోల్చుకోడం మొదలు పెట్టాను. ఒక్కడో ఒక చోట

అంకె తప్పు పడింది. అది కంప్యూటర్ తెరమీద ఎక్కడుందో అతనికి చూపించడం కోసం నా వేలిని స్క్రీన్‌కి దగ్గరగా తీసుకెళ్ళాను. మళ్ళీ షాక్ కొట్టింది. ఈ సారి కొంచెం తీవ్రంగానే. నాకేం పాలుపోడం లేదు.ఆఫీసులో ఖచ్చితంగా ఎలెక్ట్రికల్ ప్రాబ్లం ఉందని నేను వాదించాను. కానీ మిగతా వారెవ్వరికి షాక్ కొట్టడంలేదట! అయితే నా కాబిన్‌లోనే వైరింగ్ సమస్య ఏదో ఉండి ఉంటుంది, చెక్ చేయించమన్నాను. ఈ సారి వేరే ఎలెక్ట్రీషియన్‌ని పిలిపించమన్నాను .

సాయంత్రమయింది. ఇంటికి వెళ్ళడానికి సిద్ధమయ్యాం. వెళ్ళొస్తానని చెబుతూ మా సూపర్‌వైజర్ నాకు షేక్ హ్యాండిచ్చారు. పాపం ఆయనకి షాక్ తగిలినట్లుంది. బిత్తరపోయారు.

ఆయనకి దైవభక్తి, పాపభీతి ఎక్కువ. ఒక్క నిమిషం పాటు నాకేసి అదోలా చూసి.... "ఏమోయ్, ఏదైనా ధ్యానం/ యోగాభ్యాసాలు తీవ్రంగా సాధన చేస్తున్నావా?" అని అడిగారు.

నేను గతుక్కుమన్నాను. అబ్బే అలాంటివేవి లేవు సార్. యోగాభ్యాసాలు, మెడిటేషన్‌లాంటివి నా వంటికి పడవు.

"మరి నీలోంచి ఏవో శక్తి తరంగాలు వెలువడుతున్నాయి. దైవబలం కాకపోతే, ఏవైనా అతీంద్రియ శక్తుల ప్రభావం వలన కావచ్చు. ఎందుకైనా మంచిది, మా జగదానందస్వామి దర్శనం చేసుకో"

"నాకు స్వాముల మీద నమ్మకం లేదు సార్. బలవంతపెట్టకండి"

"సరే నీ ఇష్టం! బాధ పడేది నువ్వు, మధ్యలో మాకెంటంట" అని ఆయన అక్కడ నుంచి కదిలారు.

ఆయనకి వీడ్కోలు చెప్పి బస్ స్టాండ్‌కి వచ్చాను. కాసేపటికి మా కాలనీకి వెళ్ళే బస్ వచ్చింది. కానీ చాలా రద్దీగా ఉంది. నేనే జనాలని తోసుకుంటూ వెళ్ళి వెనుక నిలబడ్డాను. నన్ను దాటుకుని ఓ యువకుడు వెళ్ళాడు. అతను పూర్తిగా అధునాతన దుస్తులలో ఉన్నాడు. జుట్టుని ఫ్యాషనబుల్‌గా చిన్నగా కత్తిరించుకున్నాడు. నా పక్కనే నన్ను ఆనుకుని నిలుచున్నాడు. బస్సు కుదుపులకి నన్ను తాకాడు. పాపం అతనికి షాక్ కొట్టినట్టుంది. తల వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. నాకేసి అదోలా చూస్తూ దూరంగా వెళ్ళాడు. నాకిప్పుడు గాలి బాగా తగులుతోంది.రిలీఫ్‌గా ఫీలయ్యాను.

ఇంటికి చేరాక కాలింగ్ బెల్ కొట్టడానికి చేయి చాపాను.నేనింకా స్విచ్ మీద చేయి వేయనే లేదు. నాకు షాక్ కొట్టింది.ఆఫీసులోనే కాదు. ఇంట్లో కూడా షాకులు మొదలయ్యేసరికి సమస్య నేననుకున్నంత చిన్నది కాదని, అది సర్వాంతర్యామి అని నాకర్థమైంది.

+ + +

మర్నాడు కొత్త ఎలెక్ట్రీషియన్ వచ్చాడు. చూడ్డానికి చిన్న పిల్లాడిలా ఉన్నాడు. నా కాబిన్ వైర్లు, స్విచ్ బోర్డులు అన్నీ చెక్ చేశాడు. అతడికి ఎక్కడా ఏ లోపం కనపడలేదు.


వెళ్ళిపోతూ, నా దగ్గరకొచ్చి ' అన్నీ బానే ఉన్నాయి సార్. మీరేం టెన్షన్ పడకండి. వెళ్ళొస్తా సార్ " అంటూ ఆ అబ్బాయి నాకు షేక్ హ్యాండిచ్చాడు. అంతే. క్షణంలో ఆ అబ్బాయి ముఖం మాడిపోయింది. చటుక్కున చెయ్యి వెనక్కి తీసుకున్నాడు.

నేను ఆ అబ్బాయి కళ్ళలోకి చిలిపిగా చూశా. "ఏంభాయ్? ఏమైంది? ఏం ఇబ్బంది లేదన్నావుగా?"

"నాకిప్పుడు అర్థమైంది సార్! మీ బాడీలో చాలా కరెంట్ ఉంది. అందుకే మీకు షాక్ తగలడం, మిమ్మల్ని ముట్టుకున్నోళ్ళకి షాక్ కొట్టడం జరుగుతోంది.... మల్టీ మీటర్‌తో చెక్ చేసుకోండి సార్! మీ బాడీలో ఎంత కరెంటు ఉందో, ఓల్టేజి తేడాలు ఎంతున్నాయో మీకే తెలుస్తుంది"

"అంటే మా సార్ 'హ్యూమన్ పవర్ స్టేషన్' అన్నమాట" అన్నాడు మా అడ్మిన్ ఎగ్జిక్యూటివ్ నవ్వుతూ.

"అదేంటోయ్, థర్మల్ పవర్ గురించి విన్నాం, హైడ్రో పవర్ గురించి విన్నాం. మరి ఈ హ్యూమన్ పవర్ ఏంటి" అడిగారు సూపర్‌వైజర్.



గుంటూరు అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సభాప్రాంగణంలో 28-2-2010న జరిగిన సభలో శ్రీమతి గోటేటి లలితా శేఖర్ రచించిన "మూడో అందం" కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కథా రచయిత్రి శ్రీమతి వాద్రేవు వీరలక్ష్మీదేవి. చిత్రంలో ప్రముఖ సాహిత్య విమర్శకురాలు డా॥ మృణాళిని, శ్రీమతి గోటేటి లలితాశేఖర్, శ్రీ పెనుగొండ లక్ష్మీనారాయణ, శ్రీ రెంటాల వెంకటేశ్వరరావు, చినుకు మాసపత్రిక సంపాదకులు శ్రీ నండూరి రాజగోపాల్

"సార్ బాడీయే హ్యూమన్ పవర్ స్టేషన్. ఎంత కావాలంటే అంత కరెంట్ జనరేట్ చేసుకోవచ్చు..."

నేను ఉడుక్కున్నాను.

"సర్లేవోయ్. పిల్లికి చెలగాటం ఎలకకి ప్రాణసంకటం అంటే ఇదే. మీకు ఇలా అయితే అప్పుడు తెలుస్తుంది.." అని అతనితో అన్నాడు.

ఈ షాకు లేమిటో, నా బాడీలో కరెంటుండడం ఏంటో... ఎంత ఆలోచించినా నాకేం అంతు పట్టడంలేదు.

+ + +

ఆనోటా ఈ నోటా పడి నా శరీరంలో కరెంటున్న సంగతి మా కాలనీ అంతా వ్యాపించింది. ఓరోజు పవన్ వాళ్ళ ఆఫీసునుంచి ఫోన్ చేశాడు.

పవన్ పనిచేసే ఛానెల్లోనే క్రియేటివ్ హెడ్‌గా పనిచేస్తున్న సుకుమార్ మా కాలనీలోనే ఉంటాడు. అతడు తమ ఛానెల్ ఎండీ చెవిలో నాకరెంటు విషయం ఊదాడట. ఆయన నన్ను ఇంటర్వ్యూ చేయమని పవన్‌కి పురమాయించాడట. ఎప్పుడు రమ్మంటారని అడుగుతున్నారు.

"నాతో ఇంటర్వ్యూ ఎందుకయ్యా? నేనో సామాన్య వ్యక్తిని. నా మానాన్న నేను బతుకుతున్నాను"

"మీరు సామాన్యులని ఎవరన్నారు బావగారూ? మీరిప్పుడు సెలెబ్రిటీ! మీ ఇంటర్వ్యూ ప్రసారం చేస్తే మా ఛానెల్ రేటింగ్స్ పెరుగుతాయి. ప్లీజ్ కాదనకండి"

'సెలబ్రిటీ, లెజెండ్ల గొడవెందుకుగానీ, వచ్చే ఆదివారం పదకొండు గంటలకి మా ఇంటికొచ్చేయండి" చెప్పాడు

'బావ గారూ, ఇవాళ వస్తే ఏమైనా ఇబ్బందా? మాకు వీలైనంత త్వరగా కావాలి'

''అయితే వచ్చేయండి'' అన్నాను ఒక గంట తర్వాత మా ఇంటి ముందు ఆ ఛానెల్ వారి ఓ.బి. వ్యాన్ వచ్చి ఆగింది.

''మనమిప్పుడు తన శరీరంలో విద్యుత్తు కలిగి ఉన్న ఓ అసాధారణ వ్యక్తి గురించి తెలుసుకుందాం. ఈయనని ముట్టుకుంటే షాక్ కొడుతుంది. ఈయన ఏ ఎలెక్ట్రికల్ పరికరాన్నైనా ముట్టుకుంటే అది పని చేయడం మానేస్తుంది" అని యాంకర్ నా

గురించి చెప్పడం ప్రారంభించాడు.

"ఈయన శరీరంలో నిజంగా విద్యుత్ ఉందని నిరూపించేందుకు మేము ఓ ప్రొఫెసర్‌ని కూడా తీసుకువచ్చాం. ఇప్పుడు ప్రొఫెసర్‌గారు పరీక్షలు చేస్తారు' అని చెప్పాడు.

ప్రొఫెసర్ ఏదో పరికరాన్ని నా చేతికి పెట్టి ఫలితాల కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాడు.

"ఈయన బాడీలో స్టాటిక్ ఎలెక్ట్రిసిటీ ఎక్కువగా ఉన్నట్లుంది" చెప్పాడు ప్రొఫెసర్.

"ప్రొఫెసర్ గారూ, ఈ స్టాటిక్ ఎలక్ట్రిసిటీ నా ఒక్కడి శరీరంలో ఉందా?"

"అందరి శరీరాల్లో ఉంటుంది. కాకపోతే మీ బాడీలో కాస్త ఎక్కువ పాళ్ళలో ఉన్నట్లుంది"

"మరి అందరి శరీరాలలో కరెంటు ఉంటే, నాకొక్కడికే ఎందుకు తగులుతోంది"

బదులుగా ఆయన ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు. మరో పరికరాన్ని నా చేతికి పెట్టాడు. కొన్ని క్షణాల తర్వాత "మై గాడ్! కొన్ని సార్లు ఏనిమిది వేలోల్ట్స్, మరికొన్ని సార్లు పది వేల ఓల్ట్స్" అంటూ అరిచాడు.

"ఈయనలో తయారయ్యే కరెంటుని నిలవచేయచ్చా?" అడిగాడు యాంకర్.

"ఖచ్చితంగా, కొన్ని ప్రత్యేకమైన పరికరాలను ఈయనకి అమరిస్తే ఈయన నుంచి పవర్ జనరేట్ చేయొచ్చు.." చెప్పాడు ప్రొఫెసర్.

ఇలా ఎంతకాలం ఈయన నుంచి కరెంట్ తీసుకోవచ్చు.

"మేమింకా ఈయనపై కొన్ని పరీక్షలు చేయాలి. వాటి ఫలితాలని బట్టి పవర్ రోజూ జనరేట్ అవుతుందో లేదో నిర్ధారిస్తాం" చెప్పాడు ప్రొఫెసర్.

ఇదంతా ప్రత్యక్ష ప్రసారం చేశారు. అది ప్రసారమైన ఓ గంట తర్వాత ఆ చానెల్ వాళ్ళు మిగతా ఛానెళ్లతో కంటెంట్ షేర్ చేసుకున్నట్లున్నారు. అన్ని తెలుగు ఛానెళ్ళలోనూ, ఇతర భాషల ఛానెళ్ళలోనూ నా మొహం కనపడింది. అన్ని న్యూస్ ఛానెళ్ళలోను షాకింగ్ (బ్రేకింగ్) న్యూసే. ఉన్నట్టుండి నేను దేశ వ్యాప్తంగా పిచ్చఫేమసైపోయాను.

+ + +

కాసేపటికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి నగరబాట కార్యక్రమానికి వెడుతూ, మా కాలనీ దగ్గర ఆగాడు. తన అనుచరణతో మా ఇంట్లోకి వచ్చాడు. "బ్రదర్. ఇప్పుడే టీవీలో చూశాము. నువ్వో అద్భుతమైన మనిషివి. మాకు నువ్వు దేవుడిచ్చిన వరం. రాష్ట్రానికి నీ సేవలు అవసరం. నీకు తెలుసుగా, రాష్ట్రంలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉందని. వ్యవసాయానికి ఎలాగైనా రోజుకి తొమ్మిది గంటలపాటు కరెంటివ్వాలనేది మన ప్రభుత్వ లక్ష్యం. సంప్రదాయేతర ఇంధన వనరుల క్రింద నీ బాడీ నుంచి మూడు రోజులకొకసారి కొంత కరెంట్ తీసుకుంటాం. మార్కెట్ రేటు ప్రకారం డబ్బిస్తాం! ఏమంటావు?" అంటూ డైరక్టుగా పాయింట్ కొచ్చేశాడు.

నేనింకా పూర్తిగా నోరు తెరవలేదు, బయట ఏవో కేకలు, అరుపులు వినిపించాయి.


ప్రతిపక్షం కార్యకర్తలు, ఛోటా మోటా నాయకుల ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్నారు.

"హ్యూమన్ పవర్ డౌన్ డౌన్, మంత్రి డౌన్ డౌన్...."

"ముడుపులు పుచ్చుకొని అమ్మే విద్యుత్ మా కొద్దు"

ఇంతలో ప్రజా జిజ్ఞాస సంఘం కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకున్నారు. "మీరేం దిగులు పడకండి. మీకు మేమున్నాం. మనిషి శరీరం నుంచి విద్యుత్ తయారు చేయడం అశాస్త్రీయం అని నిరూపిస్తాం" అని నాతో అంటూ, "మీ ప్రయోగాల కోసం, ఆ మనిషి గినీ పిగ్ చేయద్దు...", "హ్యూమన్ పవర్ అంటే శరీరాన్ని అమ్ముకోవడమే...." అంటూ నినాదాలు చేశారు.

మంత్రికి చిర్రెత్తింది. "అరే, ఏంటయ్యా ఈ ప్రతిపక్షం వాళ్ళు? మంచి పనులు చేయనివ్వరు. అన్ని పనులకి అడ్డం పడుతుంటారు. సెక్రటరీ, ఈయనతో టచ్‌లో ఉండు" అని చెప్పి గొడవ చేస్తున్న వాళ్ళని దాటుకుంటూ వెళ్ళి కారెక్కాడు. మంత్రి కారెళ్ళిపోగానే. నినాదాలు చేస్తున్నవాళ్ళు జారుకున్నారు.




నా సెల్ ఫోన్ విరామం లేకుండా మ్రోగుతూనే ఉంది. ఎక్కడెక్కడ నుంచో ఫోన్లు వస్తున్నాయి. ఏవేవో వివరాలు అడుగుతున్నారు. ఏదో ప్రైవేటు పవర్ ప్లాంట్ నుంచి మాట్లాడుతున్నారట. నన్ను విద్యుత్ అమ్మొద్దని, వాళ్ళ బిజినెస్‌కి దెబ్బకొట్టద్దని అడుగుతున్నారు. బదులుగా నాకు నెలకి లక్ష రూపాయలు వాళ్ళ అసోసియేషన్ తరఫునుంచి ఇప్పిస్తారట. నాకేం జవాబు చెప్పాలో అర్థం కాలేదు. కాల్ కట్ చేసేశాను. ఫోనులో మాట్లాడి నా గొంతు గరగరలాడుతోంది. ఇక సెల్ స్విచ్ ఆఫ్ చేసేద్దామనుకుంటుండగా మళ్ళీ మ్రోగింది.

ఈ సారి తీహార్ జైలు నుంచి. ఓ కీలకమైన కేసులో నిందితుడి చేత నిజాలు కక్కించాలట! థర్డ్ డిగ్రీ ప్రయోగించకుండా, నేను సహకరించాలట! నేనొస్తానంటే రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో రానుపోను సెకండ్ ఏసి టికెట్లు పంపిస్తామన్నారు. నాకేం పాలుపోలేదు. ఏం జవాబివ్వాలో తెలియడం లేదు.

"నాకు అన్ని రోజులు సెలవు దొరుకుతుందో లేదో... ఆఫీసులో అడిగి చెబుతాను..." అన్నాను. సరే రెండు రోజులాగి ఫోన్ చేస్తామని వాళ్ళు చెప్పారు.

ఇంకో ఫోనొచ్చింది. ఈ కాల్ దేశ సరిహద్దుల నుంచి. సైన్యంలోని ఓ తెలుగు మేజర్ మాట్లాడుతున్నారు. వాళ్ళు కష్టపడి ఓ తీవ్రవాదిని పట్టుకున్నారట. వాడినుంచి దేశంలో ఎక్కడెక్కడ మారణహోమం జరపదలపెట్టింది తెలుసుకోవాలట. మామూలు పద్ధతులతో వాడేమీ చెప్పడం లేదట. నా ద్వారా వాడి నుంచి రహస్యాలు సులువుగా రాబట్టొచ్చని అధికారులు భావిస్తున్నారట. నేనొప్పుకుంటే వెంటనే మిలటరీ హెలికాప్టరు పంపుతారట.

అదీ ఫోన్ కాల్ సారాంశం

నేనిక ఆలోచించ లేదు. దేశసేవ చేస్తున్నందుకు నా ఛాతి రెండు అంగుళాలు ఉబ్బింది.

"భారతమాత సేవచేసే అవకాశం వచ్చినందుకు నాకెంతో గర్వంగా ఉంది మేజర్. నేను సిద్ధంగా ఉంటాను. హెలికాప్టర్ పంపండి."

"శభాష్! మీలాంటి దేశ భక్తుల అవసరం ఎంతో ఉంది. మన జాతికి. మీకు 'పద్మ అవార్డు'

ఇవ్వమని సైన్యం రాష్ట్రపతికి సిఫార్స్ చేస్తుంది. రేపొద్దున్నే మా జవాన్లు వచ్చి మిమ్మల్ని ఎయిర్‌బేస్ దగ్గరికి తీసుకొస్తారు. అక్కడ మా హెలికాప్టర్ ఉంటుంది. వచ్చేయండి...." అని చెప్పి ఫోన్ పెట్టేశాడు మేజర్.

నా పేరుముందు 'పద్మ' బిరుదు. తలచుకుంటేనే మనను సంతోషంతో పొంగిపోతుంది. మా వంశంలో అటేడు తరాలు, ఇటేడు తరాలలో ఎవరికీ దక్కని అరుదైన గౌరవం నాకు దక్కబోతున్నందుకు ఉబ్బితబ్బిబ్బయిపోయాను.

+ + +

మర్నాడు పొద్దున్నే ఆర్మీ వాళ్ళ జీపొచ్చి ఆగింది. నేనప్పటికే సిద్ధంగా ఉన్నాను. ఒక గంట తర్వాత హెలికాప్టర్‌లో ఉన్నాను. రాజస్థాన్‌లోని ఓ ఎయిర్‌బేస్‌కి ప్రయాణం సాగుతోంది. అక్కడి నుంచి సరిహద్దుల వద్దకి మరో వాహనంలో వెళ్ళాలట. సీట్లో కూర్చొని కూర్చుని నాకు కాళ్ళు గుంజుతున్నాయి. కాళ్ళు జాపుకుని విశ్రాంతిగా వెనక్కి వాలాను. అంతే ఉన్నట్లుండి హెలికాప్టర్ ఒక్కసారిగా ఊగిపోయింది. వాతావరణం అంతా బాగున్నా హెలికాప్టర్ ఎందుకలా ఊగిపోతుందో పైలట్లకి అర్థం కాలేదు. శంషాబాద్ ఎటిసిని సంప్రదించడానికి ప్రయత్నించారు, సిగ్నల్స్ అందలేదు. చెన్నై ఎటిసికి ప్రయత్నించారు, వాళ్ళు వాతావరణం అంతా బాగానే ఉందని, పైలట్లనే తగిన నిర్ణయం తీసుకోమని చెప్పారు. ఒక కొండ మీద ఎమర్జెన్సీ లాండింగ్ చెద్దామని పైలట్లు భావించారు. నా గుండె గుభేలుమంది. ఈ మధ్యే జరిగిన ఓ ఘోర ప్రమాదం గుర్తొచ్చింది. భయపడుతూ కాళ్ళు ముడుచుకున్నాను. క్రమంగా హెలికాప్టర్ సాధారణ స్థితికి వచ్చేసింది. అందరం హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకున్నాం. మొత్తానికి అనుకున్న సమయానికి సైనిక స్థావరానికి చేరాం. అక్కడ టీ తాగి కాసేపు విశ్రాంతి తీసుకున్నాక, నా కళ్ళకు గంతలు కట్టి ఓ రహస్య ప్రదేశానికి తీసుకెళ్ళారు. అక్కడ ఓ చిన్న జైలు లాంటిది ఉంది. నేను లోపలికి అడుగుపెట్టగానే, నాతో ఫోన్‌లో మాట్లాడిన మేజర్ వచ్చి పలకరించారు. నాకు షేక్‌హేండిచ్చి షాక్ తగులుతోందో లేదో పరీక్షించుకున్నాడాయన.

"మా ఈ ఆపరేషన్ తప్పకుండా విజయవంతమవుతుంది. వాడు చచ్చినట్లు నిజాలు చెబుతాడు..." అన్నాడాయన సంతోషంగా. తర్వాత తీవ్రవాదితో ఎలా మసలుకోవాలో వివరంగా చెప్పాడు. నాలో ఏదో ఉద్వేగం... దేశానికి సేవ చేసే అరుదైన అవకాశం దొరకడం నిజంగా నా అదృష్టం. చాలా సేపటినుంచి చెప్పులతోనే ఉండేసరికి చికాకుగా ఉంది. తీవ్రవాది గదిలోకి ప్రవేశించేముందు, చెప్పులు విప్పి లోపలికి వెళ్ళాను. తీవ్రవాదిని చూసి నేను ఆశ్చర్యపోయాను. అతను నేను ఊహించినట్లుగా భయంకరంగా, గుబురు మీసాలతో, పెద్ద గడ్డంతో లేడు. మామూలు కాలేజి కుర్రాడిలా ఉన్నాడు. నాతో పాటు లోపలికి వచ్చిన సైనికాధికారి వాడిని మళ్ళీ వివరాలు చెప్పమని హిందీలో అడిగాడు. లేకపోతే షాక్ కొట్టిస్తామని బెదిరించాడు. అయితే ఆ తీవ్రవాది బెదరలేదు, ఉలకలేదు, పలకలేదు. సైనికాధికారి నాకు సైగ చేశాడు. నేను భయపడుతూ ఆ కుర్రాడి దగ్గరికి వెళ్ళి, ఆర్మీ వాళ్ళు చెప్పినట్లుగా నా రెండు చేతుల చూపుడు వేళ్ళని అతని నుదుటి కణతల మీద ఉంచాను. అయినా అతనికేం కాలేదు. నేను గట్టిగా నొక్కాను.

"ఆహా, మాలిష్ చేస్తున్నట్లుంది. ఇంకొంచెం గట్టిగా.." అన్నాడతను హిందీలో. మాకేమీ అర్థం కాలేదు. ఈ సారి నా రెండు చేతులతో అతని జబ్బలని పట్టుకున్నాను.

"అబ్బా కితకితలు.." అని హిందీలో అంటూ పగలబడి నవ్వాడు. సైనికాధికారికి కోపం వచ్చింది, వాడి మీదకు లాఠీ ఎత్తుతూ, ఒక చేత్తో నన్ను పక్కకి లాగాడు. అంతే ఒక్కసారిగా అతడి ముఖం వివర్ణమైంది. గది తలుపులు మూయించి, నన్ను బయటకు తీసుకొచ్చాడు. బయట ఎదురుచూస్తున్న ఇతర అధికారులకు ప్రయోగం విఫలమైందని చెప్పాడు. కొన్ని నిముషాల క్రితం షాక్ కొట్టిన నా శరీరం ఇప్పుడెందుకు షాక్ కొట్టడంలేదో వాళ్ళకి అర్థం కాలేదు. ఓ చిన్న సమావేశం అత్యవసరంగా ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న ఓ డిఫెన్సు సైంటిస్టుని పిలిచారు.

ఆయన ఏవో పరికరాలతో నన్ను పరీక్షించాడు. కరెంటు చాలా తక్కువగా ఉందట. రెండు క్షణాల తర్వాత "ఏదీ ఒకసారి లేచి అటు ఇటు నడవండి. మీరు నార్మల్‌గా ఎలా నడుస్తారో అలాగే నడవండి" అని అన్నాడు. మా సంభాషణ హిందీలో సాగింది.

'పాత కాలం పెళ్ళి చూపుల్లో అమ్మాయిలు నడిచినట్లు నేనిప్పుడు నడవాలన్నమాట' అని అనుకుంటూ అక్కడ ఉన్న కొద్ది స్థలంలోనే నడిచి చూపించాను.

నన్ను క్రింద నుంచి పైకి ఎగాదిగా చూశాడు. తన పుస్తకంలో ఏదో రాసుకున్నాడు. నా కాళ్ళకి చెప్పులు లేకపోవడం గమనించాడు.

"మీ చెప్పులేవి?" గది బయట వదిలిన నా చెప్పులు చూపించాను. దగ్గరగా వెళ్ళి వాటిని పరిశీలించాడు.

"ఇప్పుడు అర్థమైంది. మీ చెప్పుల అడుగు భాగం రబ్బరుతో తయారైంది. అది పూర్తిగా ఋణాత్మక అణువులని విడుదల చేస్తుంది. ఈ చెప్పులు ధరించి నడుస్తుంటే మీలో మామూలుగానే ఎక్కువగా ఉన్న విద్యుత్ మరింత పెరిగి హైవోల్టేజిగా మారి షాక్ కొడుతుంది"

ఇంతలో గదిలోంచి తీవ్రవాది వికటాట్టహాసం చేస్తూ నినాదాలు చేయసాగాడు. "నన్ను మీరేమీ చేయలేరు. త్వరలో ఇండియా అంతా మారణహోమం జరుగుతుంది. నన్ను ఒక్కడిని పట్టుకున్నంత మాత్రాన మీరు దాన్ని ఆపలేరు.." అంటూ కేకలు వేస్తున్నాడు. నేను చెప్పులు వేసుకొని గదిలోకి వెళ్ళాను. ఈ సారి సైనికాధికారి సాయం లేకుండానే ఆ తీవ్రవాది దగ్గరికి వెళ్ళాను. నా రెండు చేతులతో అతని ముఖాన్ని పట్టుకున్నాను. అంతే. అతను కెవ్వున కేక వేశాడు. అతని ఒళ్ళు జలదరించింది. నేను కొన్ని నిముషాల పాటు నా చేతులని అతడి ముఖం చుట్టూ ఉంచాను.

"ఆపండి. నేనంతా చెప్పేస్తాను...." అంటూ అరిచాడు. మిగతా కార్యక్రమమంతా సైనికాధికారులు చూసుకున్నారు.

+ + +

కొన్ని గంటల తర్వాత నేను ఎయిర్‌బేస్‌లో ఉన్నాను. కాసేపటికి నన్ను కలుసుకోవడానికి చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్ వస్తున్నారట. నేను టీ తాగాక, అలా ఊర్లోకి వెళ్ళి కొత్త చెప్పులు కొనుక్కుందామని అనుకున్నాను. అదే విషయం నాతో మాట్లాడిన తెలుగు మేజర్‌తో చెప్పాను.

"భలేవారే. అటువంటి ఆలోచనలు మానుకోండి మీ లాంటి వ్యక్తి మాకు వేరొకరు దొరకరు. మీలో ఈ విద్యుత్ ప్రసారం జరిగినంత వరకు మీరు మాతోనే ఉండాలి. ఆ చెప్పులు వేసుకునే ఉండాలి. మాకు తెలియకుండా ఆ చెప్పులను పడేయడం గాని, పాడు చేయడంగాని చేయకూడదు. అవసరమైతే ఆ చెప్పులను సేఫ్ డిపాజిట్ లాకర్‌లో పెట్టిస్తాను. వాటిని శాస్త్రీయంగా పరిశీలించి అలాంటి చెప్పులనే ముప్పై జతలు తయారు చేయిస్తాం. మీరు వాటిని ధరించి ఆర్మీకి సేవ చేయచ్చు..." అని చెప్పాడు. నేను తెల్లబోయాను. జీవితాంతం నేనొక విద్యుత్ వాహకంగా పనిచేయాలన్న ఆలోచనే, నాకు కరెంట్ కన్నా ఎక్కువ షాకిచ్చింది.